సాక్షి
నిర్మల్
మంగళవారం ၊ 5 ၊ నవంబర్ ၊ 2024

## చెస్‌లో ప్రతిభ



ఖానాపూర్: ఏపీలోని విశాఖపట్నంలో కేకేఆర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీల్లో ఖానాపూర్ పట్టణానికి చెందిన బాలుడు శ్రీహన్‌రామ్ ప్రథమ బహుమతి సాధించాడు. బాలుడి తల్లిదండ్రులు అజయ్–దివ్యశ్రీ దంపతులు విశాఖపట్నంలో రియో వెల్ ఫిజియోథెరపి రిహాబిటేషన్‌లో పనిచేస్తున్నారు. ఈ పోటీల్లో 36 మంది పాల్గొనగా మొదటిస్థానంలో నిలిచిన బాలుడికి టోర్నమెంట్ డైరెక్టర్ చేతన్‌తోపాటు నిర్వాహకులు బహుమతి అందజేశారు.

## ఖానాపూర్ వాసికి అవార్డు



ఖానాపూర్: పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ వన్నెల జనార్దన్ అట్లాంటా జానపద వెన్నెల అవార్డు అందుకున్నారు. అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ దసరా, దీపావళి సంబరాలు అమెరికాలోని జార్జియా రాష్ట్రం అట్లాంటాలో నిర్వహించారు. 12 ఏళ్లుగా జానపద సాహిత్యానికి చేస్తున్న సేవలను గుర్తించిన అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.1 /20.1

చాలావరకు ఎండగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### డీఈవో బదిలీ



కొత్త డీఈవో నాగజ్యోతి

నిర్మల్‌రూరల్: జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిజామాబాద్ విద్యాశాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న నాగజ్యోతి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రవీందర్‌రెడ్డి ఆదిలాబాద్ డైట్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ.. రెండేళ్ల క్రితం నిర్మల్ జిల్లా డీఈవోగా ఎఫ్ఏసీపై నియమితులయ్యారు. తాజాగా బదిలీపై రానున్న నాగజ్యోతి పూర్తిస్థాయి డీఈఓగా నియమితులయ్యారు. రెండేళ్ల కాలంలో రవీందర్‌రెడ్డి జిల్లాపై తనదైన ముద్ర వేశారు. రెండుసార్లు పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపారు.

### సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధర



పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: పత్తి రైతులకు మద్దతు ధర అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే పి.రామారావుపటేల్ అన్నారు. పట్టణంలోని ఏఎంసీ కాటన్‌యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలోనే రైతాంగానికి మద్దతు ధరలు పెరిగాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం మార్కెట్ కమిటీపాలక వర్గం కృషిచేస్తుందన్నారు. ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్, డైరెక్టర్లు, నాయకులు, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

### తాత్కాలిక అటవీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద అటవీశాఖ ఉద్యోగులు

ఖానాపూర్: అటవీశాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, తాత్కాలిక సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఫారెస్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్‌తోపాటు అట వీ శాఖ జిల్లా కార్యాలయంలో తమ సమస్యల పై వేర్వేరుగా సోమవారం వినతిపత్రాలు అందజేశారు. అంతకుముందు ఖానాపూర్ పట్ట ణంలోని అటవి డివిజన్ కార్యాలయంలో మూ డు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేసి ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించడంతోపాటు ప్రతీనెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ లేదా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా సీనియార్టీని బట్టి పదోన్నతి కల్పించాలన్నారు. తమకు వేతనాలు ఇచ్చే ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నారపాక స్వామి, ఉపేందర్, సంజీవ్, రాజేశ్, సాయి, రవీందర్, నందు తదితరులు పాల్గొన్నారు.

### కబడ్డీ పోటీలకు ఎంపిక



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–17 బాలుర కబడ్డీ ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగే జోనల్ స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారు. ఇందులో ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, ఆర్గనైజర్ రమణారావు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మీ, సంజు, సంగీత, భూమన్న, సంజీవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పులి పంజా



అటవీ ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టిన అధికారులు

- మరో ఆవుపై దాడి
- కాపరులు అరవడంతో అడవిలోకి..
- మళ్లీ దిలావర్‌పూర్ మండలంలో ప్రత్యక్షం..
- రక్షణ చర్యలు చేపట్టిన అధికారులు



పులి దాడిలో గాయపడిన ఆవు

కుంటాల/దిలావర్‌పూర్: జిల్లావాసులను పులి భయం వీడడం లేదు. రోజుకో ప్రాంతంలో పశువుల కాపరుల కంట పడుతోంది. సోమవారం కుంటాల మండలంలో మరో ఆవుపై పంజా విసిరిన పులి.. సాయంత్రం దిలావర్‌పూర్ మండలంలో రోడ్డు దాటుతూ కనిపించింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం నుంచి జిల్లాలోని సారంగాపూర్ అటవీ ప్రాంతంలోకి వచ్చిన పులి.. తర్వాత కుంటాలలోకి వచ్చింది. తాజాగా దిలావర్‌పూర్ మండలం కదిలి, మాటేగాం, దిలావర్‌పూర్ పరిసర అటవీ ప్రాంతంలోకి ప్రవేశించింది. దీంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయం కుంటాల మండలం అంబుగామ గ్రామానికి చెందిన సుదర్శన్ పటేల్ పశువులను కాపరులు ఆడె రాంచందర్, మారుతి, బాలాజీ, ఈరన్న మేత కోసం అంబుగామ సమీపంలోని పీర్ల గుట్టకు తీసుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో పెద్దపులి ఓ ఆవుపై దాడిచేసింది. కాపరులు కేకలు వేయడంతో పారిపోయింది. ఆవు మెడకు, కాలికి గాయాలయ్యాయి. మరో ఆవు కనిపించకుండా పోయిందని కాపరులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వివరాలు సేకరించారు. ఇక సాయంత్రం దిలావర్‌పూర్ మండలం మాటేగాం కదిలి గ్రామాల్లో పాఠశాల విద్యార్థులను దింపి వస్తున్న రాంపూర్ సెయింట్ థామస్ పాఠశాల బస్సు ఘాట్‌రోడ్డు దిగుతున్న సమయంలో గుట్ట ప్రాంతంలో ఉన్న దిలావర్‌పూర్ డంపింగ్ యార్డు వైపు బస్సుకు అడ్డుగా పులి వచ్చిందని డ్రైవర్ సక్కురి ముత్యం తెలిపాడు. వెంటనే బస్సు ఆపేశాడు. ద్విచక్రవాహనదారులు, ఆటోలు కూడా ఆగిపోయాయి. పులి గాండ్రిస్తూ డంపింగ్ యార్డు పక్కనే ఉన్న పత్తి చేనులోకి వెళ్లిందని పేర్కొన్నారు. వెంటనే వాహనదారులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

### పశువులను తీసుకెళ్లని సూర్యాపూర్ గ్రామస్తులు..

ఇదిలా ఉంటే పులి భయంతో మండలంలోని సూర్యాపూర్, మెదన్‌పూర్ రైతులు, పశువుల కాపరులు తమ పశువులను మేతకు తీసుకెళ్లడం లేదు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల వద్దకు వెళ్లడం లేదు. మరోవైపు డీఆర్వోలు రేష్మ, శంకర్, ఎఫ్ఎస్‌వోలు కీర్తిరెడ్డి, లక్ష్మణ్, టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఎస్‌వో పూర్ణిమ, ఎఫ్‌బీవోలు హరిలత, లెనిన్, రాజేశ్, మహేశ్ పులి సంరక్షణ చర్యలు ముమ్మరం చేశారు. రేయింబవళ్లు పెద్ద పులి కదలికలను పరిశీలిస్తున్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- 'ఇథనాల్' వ్యతిరేక ఉద్యమానికి మద్దతు ఇస్తున్నాడని చర్యలు
- ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో

నిర్మల్ రూరల్: దిలావర్‌పూర్–గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమను తరలించాలని రైతులు పోరాటం చేస్తున్నారు. ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తున్నాడన్న కారణంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడిని డీఈవో సస్పెండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బాగులవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే విజయ్‌కుమార్ ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక నిరసనల్లో పాల్గొన్నట్లు ఇంటెలిజెన్స్‌వర్గాల ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారులకు సమాచారం అందింది. ఇటీవలే నిర్వహించిన జేఏసీ సమావేశానికి హాజరైనట్లు తెలుసుకున్న డీఈవో రవీందర్‌రెడ్డి సదరు ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడై ఉండి ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడంతోనే చర్యలు తీసుకున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. సస్పెన్షన్ ఉత్తర్వులు ఈనెల 2న ఉత్తర్వులు వెలువడగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

**సస్పెన్షన్ ఎత్తివేయాలి**

ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా మద్దతు తెలిపిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం సరికాదని, వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ కోరారు. పేదలపక్షాన పోరాడుతున్న వారికి మద్దతు తెలిపినందుకు సస్పెండ్ చేయడం దారుణమని పేర్కొన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## రైతులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద/నిర్మల్ రూరల్: రైతులకు ఏ సమస్య వచ్చినా ఆదుకోవడానికి అండగా ఉంటానని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నిర్మల్ రూరల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, లక్ష్మణచాంద మండలంలోని పలు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను, పలు అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. నర్సాపూర్(డబ్ల్యూ) ఎక్స్‌రోడ్ నుంచి మండల కేంద్రం వరకు రూ.68 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు రెన్యూవల్ పనులకు భూమిపూజ చేశారు. మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ), లక్ష్మణచాంద, ధర్మారం గ్రామాలలో డీసీఎంఎస్, పీఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతు భరోసా ఇవ్వలేదని, కూలీలకు ఇస్తామన్న రూ.12 వేలు ఇవ్వలేదని పేర్కొన్నారు. వడ్లకు బోనస్ ఇస్తామన్న సీఎం.. ఇప్పుడు సన్న వడ్లకే ఇస్తామంటున్నాడని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. మండల కేంద్రం నుంచి బాబాపూర్ వరకు రూ.38 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. తహసీల్దార్ జానకి, నిర్మల్ ఏఎంసీ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, ఏవో వసంత్, బీజేపీ నాయకులు సరికెల గంగన్న, రావుల రాంనాథ్, భూపాల్‌రెడ్డి, జమాల్, కౌన్సిలర్ సుధాకర్, తోకల అనిల్, అద్వాల రమేశ్, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నిర్మల్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు తక్షణమే చెల్లించాలని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందించారు. పూర్తి వేతనం చెల్లించేలా ఆర్థిక శాఖ ట్రెజరీలో అప్డేట్ చేయాలని కోరారు. హెల్పర్స్‌ను నియమించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విన్నవించారు.

### మహిళలు సాధికారత సాధించాలి



మాట్లాడుతున్న ఫైజాన్ అహ్మద్, డీఆర్‌డీవో

నిర్మల్: మహిళా స్వయంసహాయక సంఘాల సభ్యులు వివిధ బ్యాంకులు అందించే రుణాలు, బీమా సదుపాయాలపై సద్వినియోగం చేసుకోవాలని, ప్రతీ మహిళా స్వయం సాధికారత సాధించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో బ్యాంకులు అందించే రుణాలు, వివిధ రకాల బీమాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వాలు మహిళలకు, స్వయం సంఘాల సభ్యులకు అనేక రకాల రుణాలు, బీమా సదుపాయాలు కల్పిస్తున్నాయని వివరించారు. సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా శ్రీనిధి రీజనల్ మేనేజర్ సరిత, జోనల్ మేనేజర్ రవికుమార్, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్: ప్రజావాణిలో ప్రజలు తెలిపే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు కలెక్టర్‌కు సమస్య విన్నవించి అర్జీలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**కొనుగోళ్లు వేగవంతం చేయాలి..**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా, వేగంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ అధికారులతో సమావేశమయ్యారు. మండల ప్రత్యేక అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షించి విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. ఈనెల 6తో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ గడువు ముగుస్తుందని, అర్హులు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

**ఈవీఎంల గోదాం తనిఖీ..**

కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఈవీఎంల గోదాంను కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం పరిశీలించారు. గోదాం వద్ద భద్రత, నిర్వహణలపై సూచనలు చేశారు. అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## రేపే ఆఖరు



- ముగుస్తున్న ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు
- పట్టభద్రులు, టీచర్లకు ఈ నెల 6వరకే అవకాశం
- అర్హులు ఓటరుగా మారాలంటున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, టీచర్ల శాసన మండలి ఎన్నికల్లో ఓటరు నమోదుకు బుధవారం వరకే గడువు మిగిలి ఉంది. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు గడువు ముగిసిపోతే ఓటు వేసే అవకాశం కోల్పోతారు. గత సెప్టెంబర్ 30 నుంచే ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికీ చాలామంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు జాప్యం చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో అధికార యంత్రాంగం ప్రచారం చేస్తున్నా చాలామంది ఆసక్తి చూపడం లేదు. సోమవారం వరకు ఉమ్మడి జిల్లాలో 44వేల మంది వరకే పట్టభద్రులు ఓటరుగా నమోదు కోసం దరఖాస్తులు సమర్పించారు. వాస్తవానికి ఈ సంఖ్యకు మరింత ఎక్కువ మంది ముందుకు రావాల్సి ఉంది. కానీ చాలామంది ఓటరు నమోదు ఆసక్తి చూపకపోవడంతో భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య హక్కు ఓటుకు దూరమయ్యే అవకాశం ఉంది. ఇక టీచర్ల ఓటరు నమోదు సైతం నెమ్మదిగానే సాగుతోంది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో రెండు వేలకు పైగా ఉపాధ్యాయులు నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వారీగా దరఖాస్తులు అందించవచ్చు. 2021 నాటికి డిగ్రీ లేదా ఆ సమాన విద్య పూర్తి చేసిన విద్యావంతులు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకునే అర్హత ఉంది. చాలామంది ఇంకా దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో కొన్ని పట్టణాల్లో మినహా చాలా ప్రాంతాల నుంచి మందకొడిగా సాగుతోంది. అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో సీఈవో తెలంగాణ లేదా ఆఫ్‌లైన్‌లో స్థానిక బీఎల్‌వో సాయంతోనూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. గతంలో ఓటు వేసిన వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

**'ఒరిజినల్' సమస్య..**

డిగ్రీ పూర్తి చేసినప్పటికీ ఇప్పటికీ కొంతమంది వద్ద ఒరిజినల్ మెమో, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందుబాటులో లేవు. ఉద్యోగ రీత్యా, ఇతర ప్రాంతాలకు వలస కారణంగా వేర్వేరు చోట్ల సర్టిఫికెట్లు ఉండిపోయాయి. ఇక మహిళలు వివాహాలు జరిగి అత్తారింటికి రావడం, నగరాల్లో స్థిరపడ్డారు. దీంతో ఎమ్మెల్సీ ఓటరు నమోదులో సమస్య వస్తోంది. ఇప్పుడు మళ్లీ ఓటు హక్కు కోసం సేకరణ కొందరికి ఇబ్బందిగా మారింది. దీంతో ఓటు హక్కు నమోదు చేసుకోవడంలో అవరోధాలు వస్తున్నాయి. అన్ని అందుబాటులో ఉన్నవాళ్లే దరఖాస్తులు సమర్పిస్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసే క్రమంలోనూ స్పష్టత లేకపోవడంతోనూ తిరస్కరణకు గురవుతున్నాయి. అధికారులు మాత్రం స్పష్టంగా ఉన్నట్లు స్కానింగ్ చేసి అప్‌లోడ్ చేయాలని కోరుతున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు అందించిన కొందరు ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాలంటూ బీఎల్‌వోలు అడిగితే కొందరి వద్ద లేకపోవడంతోనూ తిరస్కరిస్తున్నారు.

**ఓటరు నమోదులో ఆశావహులు**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కువ మంది ఓటు హక్కు పొందేలా ఉమ్మడి జిల్లాలో కలెక్టర్ల నుంచి బీఎల్‌వో వరకు ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కార్యక్రమాలు చేస్తున్నారు. ఇక బరిలో ఉండాలనుకుంటున్న ఆశావహులు ఇంకో అడుగు ముందుకేసి, స్వయంగా వారే సర్టిఫికెట్ల వివరాలు తీసుకుని పేర్లు నమోదు చేయిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో పట్టభద్రులు, టీచర్లను ఓటర్లుగా నమోదు చేసుకోవాలంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఓ వైపు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటూనే, మరోవైపు విద్యావంతులు, టీచర్లను ఓటరుగా నమోదు చేసుకోవాలంటూ కోరుతున్నారు. అంతేకాక ఆన్‌లైన్‌లో యువత, టీచర్ల వివరాలు పంపిస్తే, స్వయంగా వారే దరఖాస్తు చేయిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా తమ వారిని నియమించుకుని ఓటర్లుగా నమోదు చేయిస్తున్నారు. తమ వారితో సోషల్‌మీడియా వేదికగా, కార్యక్రమాలు చేస్తూ ప్రచారం చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులు(ఈ నెల 4వరకు)**

| జిల్లా | పట్టభద్రులు | టీచర్ |
|---|---|---|
| ఆదిలాబాద్ | 9,414 | 662 |
| మంచిర్యాల | 19,931 | 637 |
| నిర్మల్ | 12,269 | 997 |
| ఆసిఫాబాద్ | 3,305 | 179 |
| మొత్తం | 44,919 | 2475 |

## సామాన్యులకు అండగా పోలీసులు

- ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల



అర్జీదారుని సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: పోలీసులు సామాన్యులకు అండగా ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## కాంగ్రెస్‌లో కుమ్ములాటలు

- కేబినెట్‌లో విభేదాలు..
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: రాష్ట్ర కాంగ్రెస్‌లో కుమ్ములాటలు, కేబినెట్‌లో విభేదాలను కట్టడి చేయలేని సీఎం రేవంత్‌రెడ్డి తమ లోపాలను, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్‌తో కలిసి బీజేపీ కూల్చేందుకు ప్రయత్నిస్తోందంటూ ఆరోపణలు చేయించడం ముఖ్యమంత్రి దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు. నిర్మల్ జిల్లాకేంద్రంలో సోమవారం మాట్లాడారు. పలు రాష్ట్రాలలో ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర కాంగ్రెసుదేనని, బీఆర్ఎస్‌తో కుమ్మక్కయింది కూడా కాంగ్రెస్సేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయంటూ మంత్రి శ్రీధర్‌బాబు అవగాహన లేకుండా ఆరోపణలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం బీజేపీకి లేదన్నారు. తమకు కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ప్రత్యర్థులేనని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూల్చిన పాపం కాంగ్రెసుదేనని గుర్తు చేశారు. ఇష్టారీతిన ముఖ్యమంత్రులను మార్చడం కూడా కాంగ్రెస్ నైజమన్నారు. తాజాగా రేవంత్‌రెడ్డిని మార్చి మరో సీనియర్ మంత్రిని సీఎంను చేయడానికి కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. కాంగ్రెస్‌లో ఉన్న కుమ్ములాటల గురించి తాను చెబితే, ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపణలు చేస్తున్నారని వెల్లడించారు.

## 10, 11 తేదీల్లో టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) 6వ రాష్ట్ర విద్యా మహా సభలు ఈనెల 10, 11 తేదీల్లో ఆదిలాబాద్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.మురళీ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మహా సభల పోస్టర్ విడుదల చేశారు. ఈ సభల్లో విద్యారంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వాహిద్‌ఖాన్, పోల ధర్మరాజ్, ఎ.లక్ష్మీప్రసాద్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, పవన్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సిరికొండ: మండలంలోని వాయిపేట్ వెళ్లే దారిలో సోమవారం ద్విచక్ర వాహనం, టిప్పర్ ఢీకొన్న ఘటనలో చిమ్మన్‌గూడికి చెందిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పంటచేనుకు వెళ్లిన జాదవ్ విజయ్ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

### ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరికి గాయాలు

లోకేశ్వరం: మండలంలోని మొహాళ గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై అశోక్ తెలిపారు. లోకేశ్వరంకు చెందిన జంగం స్వప్న, రాజేశ్వర్ దంపతులు నందిపేట్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా నందిపేట్ మండలంలోని బద్గుణ గ్రామానికి చెందిన సాయన్న బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో స్వప్నకు తీవ్రగాయాలయ్యాయి. నిర్మల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సాయన్నను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య



శృతి (ఫైల్)

దస్తురాబాద్: కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మున్యాల గ్రామానికి చెందిన సీమల శృతి (24) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నెల 2న పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి విజయ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### యువకుడు బలవన్మరణం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగాల్‌పేట్ సమీపంలో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుంటాల మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్ (28)రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి వాడలో ఉంటున్న అత్తగారింటికి వచ్చాడు. సోమవారం ఉదయం సమీపంలో ఉన్న మామిడి తోటలో ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### సోయా దొంగల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో గత నెల 30న 50 కిలోల సోయాబీన్ పంటను దొంగిలించిన ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. వడ్డెర కాలనీకి చెందిన ఎరిగండ్ల రాజు, చిర్చు రాజు సోయాబీన్ చోరీకి పాల్పడారు. పీఏసీఎస్ సెక్రెటరీ పండరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సోమవారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



# రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలవాలి

- ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): హనుమకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రథమస్థానంలో నిలవాలని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా పురుషులు, మహిళల జట్ల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాజట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 8 నుండి 10 వరకు హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షార్ప్‌స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, పీఈటీ భాస్కర్, సీనియర్ క్రీడాకారులు హరిలాల్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

**ఎంపికైన క్రీడాకారులు**

ఉమ్మడి జిల్లా పురుషుల జట్టుకు కెప్టెన్‌గా సిద్దార్థ రాజ్‌తో పాటు ఎం.తిరుపతి, పి.పవన్‌కళ్యాణ్, టి.దిలీప్‌కుమార్, సాయిచరణ్, తరుణ్‌సాయి, పి.శ్రీకాంత్, జి.శ్రీధర్, జి.గోపాల్, పి.దేవరాజ్, సీహెచ్ గోపాలక్రిష్ణ ఎంపికయ్యారు. మహిళల జట్టులో ఏ.స్వప్న, కే.అంజలి, డి.శ్రావణి, ఆర్.విష్ణుప్రియ, కే.స్ఫూర్తికారుణ్య, ఎం. సహస్రా, పి.శ్రావ్య, టి.ప్రజ్వల శ్రీ, ఎస్.సాయి శ్రీవర్షిణి, ఎం. శృతి ఎంపికైనట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

- సత్తా చాటిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు

ఆసిఫాబాద్‌రూరల్: కుమురంభీం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో మూడురోజులుగా నిర్వహిస్తున్న 38వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్స్‌లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జట్లు తలపడగా 23–17 గోల్స్‌తో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. ద్వితీయ స్థానంలో మహబూబ్‌నగర్ జట్టు, తృతీయ స్థానంలో కరీంనగర్ జట్టు, నాలుగోస్థానంలో రంగారెడ్డి జట్లు నిలిచాయి. విజేతలకు సీఐ రవీందర్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, డీఎస్‌వో మీనారెడ్డి, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, కోచ్ అరవింద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, స్కూల్ హెచ్‌ఎం జంగు, కోచ్‌లు విద్యాసాగర్, తిరుమల్ పీడీ, పీఈటీలు రాకేష్, రాజలింగు, కళ్యాణ్, శ్యాం, చరణ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రథమస్థానంలో నిలిచిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు



ద్వితీయస్థానంలో నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు

## విజేతగా నిలిచిన ఆదిలాబాద్ జట్టు



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఖానాపూర్, ఆదిలాబాద్ జట్లకు పోటీలు నిర్వహించగా ఆదిలాబాద్ జట్టు విజేతగా నిలిచిందని టోర్నీ నిర్వాహకులు సోఫియాన్, ఆమెర్, ఇమ్రాన్, రిజ్వాన్ తెలిపారు. ఆదిలాబాద్ జట్టుకు ప్రథమ బహుమతి రూ.10 వేల నగదుతో పాటు షీల్డును మైనార్టీ నాయకులు ఇర్ఫాన్ డానిష్ అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన ఖానాపూర్ జట్టుకు రూ.5 వేల నగదుతో పాటు షీల్డును 10వ వార్డు కౌన్సిలర్ తొంటి శ్రీనివాస్ అందజేశారు.

## 6న జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

దండేపల్లి: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 6న అండర్ 14 బాలబాలికల జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కన్వీనర్ ఫణిరాజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జట్టు వివరాలను పాఠశాల హెచ్‌ఎం సుదర్శన్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వరకుమారికి ఈ నెల 4 సాయంత్రం లోగా ఎంట్రీ వివరాలు అందిస్తే 5న డ్రా తీయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9989595232 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఎంపికైన హర్షవర్ధన్‌తో పీడీ రవి

దండేపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా మస్కాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి యోగా పోటీల్లో మంచిర్యాల జిల్లా దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, పీడీ రవి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సదరు విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు.

## హోటల్‌లో ఫుడ్ పాయిజన్!

- 13 మందికి అస్వస్థత
- ఆస్పత్రికి తరలింపు

నిర్మల్‌టౌన్: పట్టణంలోని ఏఎస్‌రెడ్డి కాలనీ కమాన్ వద్ద గల ఓ హోటల్‌లో ఆదివారం రాత్రి భోజనం చేసిన 13 మంది అస్వస్థతకు గురయ్యారు. సోమవారం ఉదయం వారికి వాంతులు, విరేచనాలు కావడంతో స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. హోటల్లో ఆహారం తిన్న తర్వాతనే తమకు వాంతులు, విరేచనాలు అయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని చేకూరుస్తున్న హోటళ్లపై చర్యలు తీసుకోవాలని రోగులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ సంఘటన జరగడంతో సోమవారం హోటల్‌ను మూసి ఉంచారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని క్రీడా మైదానంలో ఈనెల 5, 6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 జిల్లాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 1600 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, క్యారమ్, కబడ్డీ, ఆర్చరీ, టెన్నికాయిన్, తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల ఏర్పాట్లను జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, రమేశ్ పరిశీలించారు.

## సెమీస్‌కు దూసుకెళ్లిన ఆదిలాబాద్ జట్టు

ఆదిలాబాద్: మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం రాచర్ల గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి 68వ ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలికల కబడ్డీ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా జట్టు సత్తా చాటుతోంది. సోమవారం నిర్వహించిన క్వార్టర్స్ పోటీలో విజేతగా నిలిచి సెమీస్‌లోకి దూసుకెళ్లిందని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు రాష్ట్ర పాల్ తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ఏపీవో దామోదర స్వామి



అర్జీలు స్వీకరిస్తున్న దామోదరస్వామి

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో దామోదరస్వామి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జైనథ్ మండల కేంద్రానికి చెందిన రాము భూమి పట్టా చేయించాలని, ఆదిలాబాద్ మండలం దోతిగూడకు చెందిన దవరావు గుస్సాడీ కొరకు డబ్బులు మంజూరు చేయాలని, తిర్యాణి మండలానికి చెందిన మౌనిక ఏఎన్‌ఎం ఉద్యోగం ఇప్పించాలని కోరారు. ఇంకా పింఛన్, రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం ,రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, జేడీఎం నాగభూషణం, పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, ఏపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో కృత్రిమ మేధస్సుపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ విద్యలో కృత్రిమ మేధస్సు అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బాసర ట్రిపుల్ ఐటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ చండీఘర్ ఆధ్వర్యంలో సంయుక్తంగా వారంరోజులు ఈ సదస్సు కొనసాగించనున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొంటారని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాంగీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో కృత్రిమ మేధస్సు ఎలా ఉపయోగపడుతుంది, ప్రాజెక్టు నిర్వాహణ, వనరుల కేటాయింపులో ఎలా వినియోగించుకోవచ్చో చర్చిస్తారన్నారు. భద్రత వ్యవస్థలు డిజైన్ టూల్స్ తయారీ, ఆటోమేషన్ ఇంజనీరింగ్, రోబోటిక్స్‌లో ఏఐ పాత్ర, పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడం, తదితర అంశాలపై అధ్యాపకులు, విద్యార్థులు సంయుక్తంగా ఆలోచనలు పంచుకుంటారని వివరించారు. సమన్వయకర్త డాక్టర్ రాకేశ్, పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాసరలో కార్తీక దీపోత్సవం



బాసరలోని సరస్వతీ అమ్మవారి ఆలయంలో కార్తీక దీపోత్సవం కొనసాగుతోంది. ఆలయ ప్రాంగణంలోని కోటిగాజుల మండపంలో సోమవారం నిర్వహించిన దీపోత్సవంలో మహిళా భక్తులు పాల్గొన్నారు. అనంతరం భైంసాకు చెందిన విద్యార్థులు నృత్యప్రదర్శన నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

– భైంసా

## అన్యాయం జరిగిందని రైతుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

చింతలమానెపల్లి: పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేయడంలో అన్యాయం జరిగిందంటూ సోమవారం రైతులు ఆందోళన నిర్వహించారు. తమకు న్యాయం చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. వారు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని దిందా, చిత్తాం, కేతిని, గూడెం గ్రామాల శివారుల్లోని పంట భూములు గత జూలై, ఆగస్టు నెలల్లో ప్రాణహిత నది వరదల్లో నీటమునిగాయి. ఈమేరకు ప్రభుత్వం సర్వే నిర్వహించింది. ఇటీవల నష్ట పరిహారం మంజూరైన రైతుల జాబితా విడుదలైంది. ఈ జాబితాలో పంట నష్టపోయిన ఆయా గ్రామాల రైతుల పేర్లు నమోదు కాలేదు. ఏఈవో పంట నష్టం సర్వే సక్రమంగా నిర్వహించలేదని అర్హులైన రైతులకు అన్యాయం జరిగిందని రైతులు ఆరోపించారు. పంటనష్టంపై మరోసారి సర్వే నిర్వహించాలని కోరుతూ తహసీల్దార్ మునావర్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు.

# నీటిమోటార్లకు తాళాలు

- మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు
- నిలిచిన నీటి సరఫరా
- తాగునీటికి కాలనీవాసుల ఇబ్బందులు



చెన్నూర్ గెర్రెకాలనీలో మోటార్‌కు వేసిన తాళం

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీ పరిధిలోని నీటిమోటార్లు వినియోగించకుండా మున్సిపల్ అధికారులు తాళాలు వేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తాళాలు వేయడంతో తాగునీటికి కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 18వార్డుల్లోని 120 మోటార్లకు ఏకకాలంలో తాళాలు వేయడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. కౌన్సిల్ తీర్మానం లేకుండా, కాలనీ వాసులకు సమాచారం ఇవ్వకుండా తాళాలు వేయడంతో కమిషనర్ మురళీకృష్ణపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. క్యాతనపల్లి మున్సిపాల్టీలో కమిషనర్ తీరు వివాదాస్పదంగా మారడంతో ఇక్కడికి బదిలీ చేయగా.. ఇక్కడా అదే తీరుగా వ్యవహరిస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాల్టీలో 23,527 జనాభా, 18 వార్డులు ఉండగా.. మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లా కనెక్షన్లు 7,629 ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 5,676 కనెక్షన్లు ఇవ్వగా.. మరో 1953 కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు సక్రమంగా సరఫరా జరగడం లేదు. నాసిరకం పైపులైన్లు వేయడంతో లీకేజీలతో బిందెడు నీరు కూడా రావడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. దీంతో కొన్ని కాలనీల్లో ప్రజలు తాగునీటికి మోటార్లను వినియోగించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. మోటార్ల నిర్వహణ కోసం కనెక్షన్‌కు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు.

### మిషన్ భగీరథ నీరు వస్తలేదు..



మా కాలనీలో మిషన్ భగీరథ నీరు వస్తలేదు. మోటార్ల ద్వారా నీటిని వినియోగిస్తున్నాం. నీటి వాడకానికి పన్నులు కడుతున్నాం. మా కాలనీలో ఇతర నల్లా కనెక్షన్లు లేవు. తాగునీటికి ఇతర అవసరాలకు మోటార్ల ద్వారా వచ్చే నీరే దిక్కు. అధికారులు ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా మోటార్లకు తాళాలు వేయడం దారుణం. – సుజాత, లైన్‌గడ్డ

### వృథాను అరికట్టేందుకే..

మున్సిపాలిటీలో మిషన్ భగీరథ నీరు వస్తుంది. మోటార్ల ద్వారా నీరు, విద్యుత్ వృథా అవుతున్నాయి. మోటార్ల విద్యుత్ బిల్లులు రూ.3.50 లక్షల వస్తుంది. మోటార్ల నిర్వహణ కోసం రూ.100 వసూలు చేస్తున్నాం. ఇందులో 20 శాతం మంది మాత్రమే చెల్లిస్తున్నారు. మిగతా వారంతా చెల్లించడం లేదు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయొద్దని మోటార్లకు తాళాలు వేశాం. ప్రజలు అర్థం చేసుకు అధికారులకు సహకరించాలి.

– మురళీకృష్ణ, కమిషనర్, చెన్నూర్

## తండ్రిని హత్య చేసిన కుమారుడికి జీవితఖైదు

నిర్మల్‌టౌన్: తండ్రిని హత్య చేసిన కుమారుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పింజారిగుట్టకు చెందిన గణపతికి ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు అభిలాష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా చిన్నకుమారుడు అన్వేష్ ఇంట్లో ఖాళీగానే ఉంటున్నాడు. తనకు పెళ్లి చేయమని తరచూ తండ్రితో గొడవ పడేవాడు. అన్నయ్య వివాహం అయిన తర్వాత చేస్తానని తండ్రి మందలించేవాడు. 13 జూన్ 2022న తండ్రి వంట గదిలో ఉండగా అన్వేష్ అతని వద్దకు వెళ్లి పెళ్లి చేయమని గొడవపడ్డాడు. ఈక్రమంలో కూరగాయలు కోసే కత్తితో గణపతి కడుపులో పొడిచాడు. తప్పించుకొని బయటకు పారిపోగా ఇంట్లో ఉన్న కొడవలితో విచక్షణ రహితంగా నరికి చంపాడు. మృతుని అల్లుడు రాజు నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్ రావు 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ సోమవారం నిందితునికి జీవితకాలం కఠిన కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

## 12 నుంచి నారాయణుడి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనారాయణస్వామి ప్రతిమ

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 12 నుంచి 27 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా కార్తీక మాసంలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 12న విశ్వక్‌సేనపూజ, పుణ్యహావచనం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ట, 13న నిత్యహవనము, ధ్వజారోహణం, స్వాముల దీక్షా విరమణ, బలిహారం, నగర భోజనం, కళ్యాణ మహోత్సవం, సంతానం లేని స్త్రీలకు గరుడ ప్రసాద కార్యక్రమాలు, 14న హవనం, తీర్థప్రసాద వితరణ, 15న బలిహారం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, శేషవాహన సేవ, 16న శేషహోమం, బలిహారం, గజవాహన సేవ, 17న అశ్వవాహన సేవ, స్వామివారి ఊరేగింపు, 18న హన్మంత్ వాహన సేవ, 19న అఖండజ్యోతి, గరుడ వాహన సేవ, 20న స్వాముల దీక్షా విరమణ, నాగబలి, పుష్పయాగం, గ్రామబలి, ఉద్వాసనం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## బైక్‌ను ఢీకొట్టి బొలెరో బోల్తా



బొలెరోను తొలగిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో బొలెరో బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముత్నూర్ గ్రామానికి చెందిన వ్యాపారి గోపాల్ సోమవారం ద్విచక్ర వాహనంపై ఇంద్రవెల్లికి వస్తుండగా వెనుకనుంచి అతివేగంగా వచ్చిన బొలెరో బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఘటనలో బైక్ నడుపుతున్న గోపాల్‌కు తీవ్రంగా, బొలెరోలో ఉన్న మహారాష్ట్రకు చెందిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గోపాల్‌ను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్సై సునీల్ ఘటన స్థలానికి చేరుకుని రోడ్డుపై ఉన్న వాహనాన్ని జేసీబీ సాయంతో తొలగించి ఇంద్రవెల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా సంఘటనపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై తెలిపారు.

## విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని రచ్చపల్లి గ్రామానికి చెందిన జాడి బాపు (45) అనే రైతు విద్యుత్ తీగలకు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాపు ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని మరో రైతు వరి పొలంలో నుంచి తన పొలానికి వెళ్తుండగా సదరు రైతు తన పొలంలోకి అడవి పందులు రాకుండా ఉండేందుకు అమర్చిన విద్యుత్ తీగలను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా శవమై కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య తిరుపతమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

## ముగ్గురు యువకుల బైండోవర్

జన్నారం: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం రాత్రి మద్యం సేవించి న్యూసెన్స్ చేసిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసి తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజవర్దన్ సోమవారం తెలిపారు. పొనకల్ గ్రామానికి చెందిన మహ్మద్ అవేజ్, మహ్మద్ ట్రాబేజ్, చిలువేరు కార్తీక్ మద్యం సేవించి రోడ్డుపై న్యూసెన్స్ చేయడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## సకాలంలో స్పందించి... ఆస్పత్రికి తరలించి

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన వసీమ్ ఖురేషి (33) నాలుగు రోజుల క్రితం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంది సోమవారం భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో స్వగ్రామానికి బయలుదేరాడు. గ్రామ శివారులోకి రాగానే ఫిట్స్ రావడంతో స్పందించిన బస్ కండక్టర్ సంపత్, డ్రైవర్ పరశురాం బస్సును నేరుగా నర్సాపూర్ (జి) 30 పడకల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ సురేందర్ ప్రథమ చికిత్స అందించి నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు 108లో నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కండక్టర్, డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు.